నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 7 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- నిబంధనలను తప్పకుండా పాటించాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : గ్రూప్-1 పరీక్షల నిర్వహణను పక్కాగా నిర్వహించాలని, నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, బయోమెట్రిక్ ఆఫీసర్లకు పరీక్ష నిర్వహణపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 9న నిర్వహించే గ్రూప్ -1 పరీక్షకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణను చీఫ్ సూపరింటెండెంట్లు చేపట్టాలని, కేంద్రాల్లో సీటింగ్, వసతులను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పరిశీలించాలని అన్నారు. ఆడ, మగ అభ్యర్థులకు వేర్వేరుగా తనిఖీ ఏర్పాట్లు చేయాలని, ఇతరులను అనుమతించవద్దని, ఫ్లయింగ్ స్క్వాడ్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణతో పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. పరీక్ష రోజు ప్రతి సెంటర్‌ను మూడు సార్లు పరిశీలించాలన్నారు. ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు అభ్యర్థుల ఐడీ కార్డులతో పాటు హాల్ టికెట్లను పరిశీలించాలని, పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, ఒక చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఎమర్జెన్సీ కోసం అనుమతి ఉన్నదని తెలిపారు. పరీక్షకు జిల్లాలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. సుమారు 3,349 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమాచారం, హాల్ టికెట్ డౌన్‌లోడ్ గురించి జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ 8331997006, 8331997037 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. హాల్‌టికెట్‌ను http://www.tspsc.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఏ4 పేపర్‌లో ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థి లేటెస్ట్ ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలన్నారు. పరీక్ష హాల్‌కు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్, ఓటరు ఐడీ, ఇతర ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలని తెలిపారు. హాల్ టికెట్‌లో ఫొటో సరిగా ముద్రణ కాకపోయినా, కనిపించకున్నా గెజిటెడ్ అధికారి, అభ్యర్థి చివరగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌తో ధ్రువీకరించిన మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను, అండర్ టేకింగ్ ఫామ్ (టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్)తో పాటు తీసుకురావాలన్నారు. ఆ ఫొటోలు, అండర్ టేకింగ్ ఫామ్‌ను పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు అందించాలని, లేకుంటే పరీక్ష హాల్‌లోకి అనుమతించబడరని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా తన బయోమెట్రిక్‌ను ఇవ్వకపోతే వారి ఓఎంఆర్ ఆన్సర్ షీట్ మూల్యాంకనం చేయబడదని పేర్కొన్నారు. చేతులకు మెహందీ, టాటూలతో పరీక్షకు వెళ్లకూడదని, ఒకవేళ ఉంటే బయోమెట్రిక్ చేయుటకు తంబ్ ఇంప్రెషన్ పడకపోవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూస్, సాక్స్ ధరించరాదని, చెప్పులు మాత్రమే వేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబడరని చెప్పారు. అభ్యర్థికి ఒకవేళ చేతులు లేకపోతే సహాయకుల కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి వాటర్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, చేతి గడియారాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, బ్లూటూత్ డివైస్‌లు, పెన్‌డ్రైవ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, తెల్ల కాగితాలు అనుమతించబడవని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద వస్తువులు భద్రపరచడానికి స్టోరేజీ సౌకర్యం కల్పించలేదని సూచించారు. పరీక్ష హాల్‌లో ప్రతి అర్ధ గంటకు హెచ్చరిక బెల్ మోగుతుందని, అభ్యర్థులు గమనించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ కె.నారాయణ రెడ్డి, టీజీపీఎస్సీ రీజనల్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ బాలాజీ, ఏడీఏ నీలిమ, అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన టీఎస్ ఐసెట్

రామగిరి, జూన్ 6 : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్ష గురువారం ముగిసింది. నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని డీపీఎంఎస్ పరీక్ష కేంద్రంలో ఆన్‌లైన్‌లో జరిగిన పరీక్షకు రెండో రోజు 185మంది విద్యార్థులకుగాను 173మంది హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి వెల్లడించారు.

## నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్లపై కేసు నమోదు

నీలగిరి, జూన్ 6 : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం రాత్రి 9గంటల సమయంలో కౌంటింగ్ హాల్-2లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ఓ వెంకటేశ్వర్లు వద్దకు వచ్చి బ్యాలెట్ పేపర్లు చూపించాలని భూపాల్‌రెడ్డి అడిగారు. మీరు ఎవరు, గుర్తింపు కార్డు చూపించాలని ఏఆర్ఓ అడుగగా.. స్వతంత్ర అభ్యర్థికి చెందినది, అది కూడా హాల్-3కు సంబంధించినది చూపించారు. దాంతో ఏఆర్ఓ తన విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తిప్పర్తి పోలీసులు భూపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

# గెలుపు కోటా 1,55,095 ఓట్లు

**తొలి ప్రాధాన్యతలో తేలని విజేత**

- 18,565 ఓట్ల ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న
- 1,04,248 ఓట్లతో రెండో స్థానంలో రాకేశ్‌రెడ్డి
- మొదలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- నేడు వెలువడనున్న తుది ఫలితం
- కౌంటింగ్‌లో ఏకపక్ష ధోరణిపై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఊహించినట్లుగానే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలలేదు. బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం గెలుపు కోటాకు దూరంగా నిలిచిపోయారు. దాంతో విజేతను తేల్చేందుకు ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 8గంటలకు మొదలైన కౌంటింగ్‌లో తొలి రోజు సాయంత్రం వరకు కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం 4గంటల నుంచి మొదలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు రెండో రోజు సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. మొత్తం నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగగా ఒక్కో రౌండ్ కనీసం ఐదారు గంటల సమయం తీసుకుంది. ఇక ఎలిమినేషన్ రౌండ్ సైతం సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేడు మధ్యాహ్నానికి తుది ఫలితం వెలువడి విజేత తేలనున్నట్లు అంచనా.

కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

### తొలి ప్రాధాన్యతలో తేలని ఫలితం

మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం నాలుగు హాళ్స్‌లో 96టేబుళ్లపై లెక్కింపు కొనసాగింది. కౌంటింగ్‌లో అందరి దృష్టి ప్రధాన అభ్యర్థులుగా భావించిన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్‌పైనే ఉంది. తొలి మూడు రౌండ్లలో తీన్మార్ మల్లన్నకు ఆధిక్యం లభించగా చివరి రౌండ్‌లో రాకేశ్‌రెడ్డి స్వల్ప ఆధిక్యతను ప్రదర్శించారు. నాలుగు రౌండ్లు ముగిసేసరికి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు, ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, అశోక్‌కుమార్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. ఇందులో మొత్తంగా తీన్మార్ మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లని ఓట్లను వేరు చేసి చెల్లిన ఓట్లను పరిగణలోకి తీసుకుని గెలుపు కోటాను ఫైనల్ చేశారు.

### గెలుపు కోటాకు దూరంగా...

మొత్తం పోలైన ఓట్లల్లో తొలి ప్రాధాన్యత లెక్కింపు పూర్తయ్యాక పరిశీలిస్తే 25,824ఓట్లు చెల్లనివిగా లెక్క తేలాయి. పట్టభద్రులై ఉండి కూడా నిబంధనల ప్రకారం ఓటు వేయడంలో వీరు విఫలం కావడం గమనార్హం. వీటిని తొలిగించిన అనంతరం చెల్లిన ఓట్ల సంఖ్య 3,10,189గా తేలింది. వీటిల్లోంచి 50శాతం ఓట్లు ప్లస్ ఒక్క ఓటును జత చేయగా గెలుపుకోటా 1,55,095 ఓట్లుగా నిర్ధారణ జరిగింది. ఈ ఓట్లను ఏ అభ్యర్థి అయితే సాధిస్తారో వారే విజేత కానున్నారు. ప్రస్తుతం అభ్యర్థుల వారీగా ఓట్లను పరిశీలిస్తే తీన్మార్ మల్లన్న గెలుపు కోటాను చేరుకోవాలంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో 32,282 ఓట్లు సాధించాలి. రాకేశ్‌రెడ్డి విజేతగా నిలువాలంటే 50,853 ఓట్లు ద్వితీయ ప్రాధాన్యతలో పొందాలి. ప్రస్తుతం ఎవ్వరూ కూడా గెలుపు కోటాకు చేరుకోలేకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

### ఎలిమినేషన్ పద్ధతిలో విజేతగా..

అతి తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లు పొందిన అభ్యర్థి నుంచి పైకి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా ఇందులో 10 ఓట్లు మాత్రమే సాధించి చివరలో నిలిచిన యాతాకుల శేఖర్ నుంచి ఎలిమినేషన్ మొదలైంది. శేఖర్‌కు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచివేస్తూ వస్తారు. ఇలా కిందనుంచి పైకి ఒక్కొక్క అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను వేస్తూ వస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడ కౌంటింగ్ నిలిపివేస్తారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే చివరి వరకు తీన్మార్ మల్లన్నతోపాటు రాకేశ్‌రెడ్డి పోటీలో నిలువనున్నారు. అప్పటికీ కోటా తేలకపోతే రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కూడా మొదటి అభ్యర్థికి పంచివేస్తూ విజేతను ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా ముగిసి విజేత తేలాలంటే శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం తీసుకోవచ్చని అంచనా.

### ఎవరికి ఎన్ని ఓట్లు

| అభ్యర్థి పేరు | మొదటి ప్రాధాన్యత ఓట్లు |
|---|---|
| తీన్మార్ మల్లన్న | 1,22,813 |
| ఏనుగుల రాకేశ్‌రెడ్డి | 1,04,248 |
| గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి | 43,313 |
| అశోక్ కుమార్ పాలకూరి | 29697 |
| బక్క జడ్సన్ | 2,057 |
| బరిగెల దుర్గాప్రసాద్ ముహారాజ్ | 1,947 |
| సోదె వెంకటేశ్వర్లు | 812 |
| గుండాల జ్యోతి | 547 |
| పూజారి సత్యనారాయణ | 538 |
| పెట్టెం మల్లికార్జున్ | 457 |
| కర్నె రవి | 268 |
| మందర మల్లికార్జున్‌రావు | 241 |
| పెడిశెట్టి రాజు | 228 |
| ఐతగోని రాఘవేంద్ర | 213 |
| ఈద శేషగిరిరావు గౌడ్ | 197 |
| తాడిశెట్టి క్రాంతికుమార్ | 184 |
| దునుకు వేలాద్రి | 181 |
| అంబాల రాజేశ్ | 154 |
| చంద్ర క్రాంతికుమార్ | 144 |
| కంటె సత్యన్న | 132 |
| కోడిరెక్క ఉమాశంకర్ | 124 |
| పూస శ్రీనివాస్ | 110 |
| రాజు నాయక్ గుగులోతు | 108 |
| జానయ్య నందిపాటి | 107 |
| ఏఎస్ కృష్ణ | 103 |
| చెన్న శ్రీకాంత్ | 100 |
| అనిల్ కుమార్ గాదెపాక | 87 |
| పాటి శ్రీకాంత్‌రెడ్డి | 84 |
| గుగులోతు భీమా | 82 |
| మాదవపెద్ది వెంకట్‌రెడ్డి | 78 |

మిగిలిన 21 మంది అభ్యర్థులందరికీ కలిపి మొత్తం 782 ఓట్లు వచ్చాయి

### గెలుపుపై ధీమాలో కాంగ్రెస్, బీఆర్ఎస్

ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గెలుపుపై అటు తీన్మార్ మల్లన్న, ఇటు రాకేశ్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి తనకే ఎక్కువ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పోలవుతాయని భావిస్తున్నారు. అటు స్వతంత్ర అభ్యర్థి అశోక్‌తో పాటు బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిలకు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లే విజేతను తేల్చడంలో కీలకంగా మారనున్నాయి. వీరికి పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఎటువైపు ఉంటే వారే విజేతగా నిలువనున్నారు.

కౌంటింగ్‌లో అభ్యంతరాలపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## కౌంటింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ ఆందోళన

కౌంటింగ్ కేంద్రంలో ఆర్ఓతోపాటు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చారు. ఓట్ల లెక్కింపులో తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే ఫలితాలు ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలు టేబుళ్లపై ఓట్ల లెక్కింపుతోపాటు మూడో రౌండ్‌లో తమకు సంబంధం లేకుండానే ఫలితాన్ని ప్రకటించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కౌంటింగ్ కొనసాగాలే చూడాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్‌లో తమ అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఎన్నికల కమిషన్‌తోపాటు అబ్జర్వర్ రాహుల్ బొజ్జకు, రిటర్నింగ్ అధికారి హరిచందనకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి లేఖను అందజేశారు.

## బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి

అనాజీపురంలో బడిబాట కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో నారాయణరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణరెడ్డి కోరారు. బడిబాటలో భాగంగా గురువారం భువనగిరి మండలంలోని అనాజీపురం ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుంచి 14 నంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న వసతులు, పథకాలు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేసే డ్రెస్సులు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, డిజిటలైజేషన్ తరగతులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.నాగవర్ధన్‌రెడ్డి, సీఎంఓ పెసరు లింగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాయపురం ప్రీతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈ నెల 11న జడ్పీ సర్వసభ్య సమావేశం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 11న జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. అధికారులు ఆయా శాఖల పరిధిలోని సమగ్ర నివేదికలతో రావాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- సేకరణలో తొలుత ఇబ్బందులు.. ఆ తర్వాత క్లియర్
- 35,820 మంది రైతుల నుంచి 37లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు
- గతేడాది కంటే 53వేల మెట్రిక్ టన్నులు తక్కువ
- సాగు నీరు అందక.. ప్రైవేట్‌లో అమ్ముకోవడంతోనే..
- కర్షకుల ఖాతాల్లో రూ. 615 కోట్లు జమ

యాదాద్రి భువనగిరి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కొనుగోళ్ల సమయంలో మొదట ఇబ్బందులు, వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవడం మినహా సేకరణ సజావుగా ముగిసింది. జిల్లాలో మిల్లుల్లో నిల్వ స్థలాభావం ఉండటంతో ఇతర జిల్లాలకు తరలించి కొనుగోళ్లు పూర్తి చేశారు. మొత్తం 3.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. గత యాసంగి కంటే ఈ సారి నెల ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

### రూ. 615 కోట్ల చెల్లింపులు పూర్తి

జిల్లాలో 2.93లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. సుమారుగా 5.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. సివిల్ సప్లయ్ అధికారులు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 323కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో 85 ఐకేపీ, 225 పీఏసీఎస్, 12 ఎఫ్‌పీఓలు ఉన్నాయి. బుధవారంతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. అన్ని చోట్లా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను మూసివేశారు. మొత్తంగా 3.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నారు. ఇందులో 3.36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారు. రైతులకు రూ. 741 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 615 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంకా రూ. 125 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది.

### ధాన్యం కొనుగోళ్ల వివరాలు

| అంశం | 2023 | 2024 |
|---|---|---|
| కేంద్రాలు | 321 | 323 |
| రైతులు | 43,924 | 35,820 |
| కొన్న ధాన్యం | 3.90 లక్షల మెట్రిక్ టన్నులు | 3.37 లక్షల మెట్రిక్ టన్నులు |
| ధాన్యం విలువ | రూ.790 కోట్లు | రూ. 741కోట్లు |

### కొనుగోళ్లలో ఇబ్బందులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తొలుత ఇబ్బందులు తలెత్తాయి. మెజార్టీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగలేదు. కల్లాల్లో ఎక్కడ పోసిన ధాన్యం కుప్పలు అక్కడే దర్శనమిచ్చాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలకు కొరత ఏర్పడింది. ప్రభుత్వం ధాన్యం కాంట వేసినా తరలింపులో మాత్రం జాప్యం జరిగింది. ప్రధాన కారణంగా లారీల కొరత వెంటాడింది. మరోవైపు హమాలీల సమస్య కూడా వేధించింది. అకాల వర్షాలు రైతులను ఇబ్బందులు పెట్టాయి. అనేక కేంద్రాల్లో వర్షం నుంచి రక్షించుకునేందుకు సరిపడా టార్పాలిన్లు, షెడ్లు లేవు. దాంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసింది. కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు మే మూడోవారం నుంచి కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లాలో స్టోరేజీ లేకపోవడంతో జనగాం, వరంగల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు తరలించి సఫలీకృతం అయ్యారు.

ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

### గతేడాది కంటే తక్కువే..

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు తగ్గాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి 50వేల మెట్రిక్ టన్నుల వరకు తగ్గుముఖం పట్టాయి. గతేడాది ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ వ్యూహం, పక్కా కార్యాచరణతో పనిచేయడంతో ఇబ్బందులు లేకుండా సాఫీగా ధాన్యం సేకరణ ముగించింది. అప్పుడు 3.90లక్షల మెట్రికల్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. కానీ ఈ సారి మాత్రం 3.37లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. ఈ సారి ప్రధానంగా వర్షాలు సరిగ్గా లేకపోవడం, భూగర్భజలాలు తగ్గడం, సాగు నీటి సమస్య తలెత్తడంతో దిగుబడి తగ్గింది. కొనుగోళ్లు సకాలంలో జరుగకపోవడంతో కొంత మంది రైతులు బయట ప్రైవేట్‌లో అమ్ముకున్నారు. గతేడాది 43,924 మంది రైతుల నుంచి ధాన్యం కొనగా, ఈ సారి 35,820 మంది నుంచి మాత్రమే వరి కొనడం గమనార్హం.

### నెల ముందుగానే కొనుగోళ్లు పూర్తి

యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ముందుగానే పూర్తి కావడం సంతోషంగా ఉంది. 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అనుకున్నాం. అనతి కాలంలోనే 3.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. గత యాసంగి కంటే నెల రోజుల ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేయగలిగాం. ఈ సేకరణలో అన్ని విభాగాల అధికారులు జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించారు. బియ్యం సేకరణలో కూడా జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని అధికారులకు సూచించాం.

- పి. బెన్ షాలోమ్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ దాసరి హరిచందన

## పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- రాత్రి 9గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- నాలుగు రౌండ్లు పూర్తయ్యేసరికి చెల్లిన ఓట్లు 3,10,189
- రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు సిద్ధం
- రిటర్నింగ్ ఆఫీసర్ దాసరి హరిచందన

నల్లగొండ రూరల్, జూన్ 6 : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ అంతా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నదని రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. ఏజెంట్లు సంతకాలు చేసిన తరువాతే ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పారు. నల్లగొండ జిల్లా అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాత్రి 9గంటల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయిందన్నారు. మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా.. అందులో 3,10,189 ఓట్లు చెల్లుబాటయ్యాయని, గెలుపు కోటా 1,55,095 ఓట్లు అని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తీన్మార్ మల్లన్నకు 1,22,813, రాకేశ్‌రెడ్డికి 1,04,248, ప్రేమేందర్‌రెడ్డికి 43,313, పాలకూరి అశోక్‌కూమార్ గౌడ్‌కు 29,697 ఓట్లు వచ్చాయన్నారు. గెలుపునకు కావాల్సిన 1,55,095 ఓట్లు మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నట్లు తెలిపారు. 52 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ ప్రారంభిస్తామన్నారు. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్ల కౌంటింగ్ ప్రక్రియ అలస్యమవుతందని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ టీవీల్లో రికార్డు అవుతుందన్నారు.